

## రమణీయం.. తిరుచ్చి ఉత్సవం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. స్వామివారిని పల్లకీలో ఉంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.



## ప్రైవేటు దిగిరాక.. అడ్మిషన్లు అందక!

పేద విద్యార్థుల ఉచిత విద్యకు ఎంపికైనా ప్రైవేట్ పాఠశాలలు అడ్మిషన్లు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కర్నూలులోని డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు.

8లో▸



## సీమ రైతులపై కపట ప్రేమ

రాయలసీమ రైతులపై సీఎం చంద్రబాబు కపట ప్రేమ చూపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. పోతిరెడ్డిపాడులో నీళ్లు ఉన్నా ఇవ్వడం లేదని ఆరోపించారు.

8లో▸

## న్యూస్‌రీల్

### నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

గోస్పాడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పార్వతీపురం హైస్కూల్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడి పాఠశాల యూపీ వరకు కొనసాగుతుండేదని, ప్రస్తుతం హైస్కూల్‌గా మార్పు చేసి 9వ తరగతి కొనసాగుతుందని, ప్రస్తుతం పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను అదనంగా ఉపాధ్యాయులు పెంచేలా చూడాలన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పరిశీలించారు.

### 54,784 మందికి ఇంటి వద్దనే రేషన్ పంపిణీ

నంద్యాల(అర్బన్): జిల్లాలోని వృద్ధులు, దివ్యాంగులు, నిస్సాహాయ స్థితిలో ఉన్న 54,784 మందికి జూలై నెలకు సంబంధించి ఇళ్ల వద్దనే రేషన్ పంపిణీ జరుగుతోంది. కార్డు కలిగిన వయస్సు 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, నిస్సాహాయ స్థితిలో ఉన్న వారు జిల్లాలో దాదాపు 54,784 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు డీలర్లు, వీఆర్‌ఓల ఆధ్వర్యంలో ఇళ్ల వద్దకే వచ్చి రేషన్ పంపిణీ చేయనున్నారు. రేషన్ పంపిణీ ఎప్పుడు ఇస్తారనే విషయాన్ని ముందుగానే తెలియజేస్తారు. జాబితా ప్రకారం డీలర్ వారి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ పంపిణీ అందించాలని, అలా ఇవ్వని డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 26, 27వ తేదీల్లో 7,604 మందికి 13.88 శాతంతో రేషన్ పంపిణీ జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

### డీఏఓ బాధ్యతల స్వీకరణ



డీఏఓ వెంకటేశ్వర్లు

నంద్యాల(అర్బన్): జిల్లా వ్యవసాయాధికారిగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డీఏఓగా ఉన్న మురళీకృష్ణ విజయవాడ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు డీడీఏగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును వ్యవసాయాధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అలాగే నంద్యాల ఏడీఏగా ఆంజనేయ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏడీఏగా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ కర్నూలుకు బదిలీ కాగా ఆత్మకూరు ఏడీఏగా పని చేస్తున్న ఆంజనేయ బదిలీపై నంద్యాల ఏడీఏగా బాధ్యతలు స్వీకరించారు.

### ఆశా కార్యకర్తల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గోస్పాడు: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఆశా కార్యకర్తల ఉద్యోగ భర్తీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆశా కార్యకర్తలు 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 24, పట్టణ ప్రాంతాల్లో 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిర్ణీత దరఖాస్తు నమూనాలను https://nandyal.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందు పరిచారన్నారు. దరఖాస్తులను ఈనెల 28 నుంచి వచ్చే నెల 2వ తేదీ లోపు పట్టణాల్లో వారు వార్డు సచివాలయాల పరిధిలోని యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు, గ్రామీణ ప్రాంతాల వారు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లకు అభ్యర్థులు స్వయంగా తమ దరఖాస్తులను అందజేయాలన్నారు.

### నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

మహానంది: మహానందిలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద పథకానికి అవసరమైన మేరకు కూరగాయలను ఉచితంగా పంపించేందుకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ నగర్ మార్కెట్‌కు చెందిన వ్యాపారులు ముందుకు వచ్చారని ఏఈఓ ఎరమల మధు, ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. ఈ మేరకు వేదపండితులు రవిశంకర అవధాని, హనుమంతుశర్మ, అన్నప్రసాద పథకం ఇన్‌చార్జ్ రామశివలు శుక్రవారం హైదరాబాద్ వెళ్లి మార్కెట్‌లోని వ్యాపారులను కలిశారు. మార్కెట్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్రారెడ్డి, జయ ప్రకాష్‌రెడ్డిలతో పాటు సభ్యులైన బుచ్చయ్య, శ్రీశైలం నరసింహులు, భాస్కర్‌రెడ్డి, రాకేష్ రెడ్డి, తదితరులను కలిసి విన్నవించగా వారు ఒప్పుకున్నారని వివరించారు.

# రోడ్లు ఛిద్రమై.. పల్లె కన్నీరై!

తొలగని 'దారి'ద్ర్యం

గ్రామీణ ప్రాంతాలకు చెందిన రోడ్లు పూర్తి స్థాయిలో ఛిద్రం అయ్యాయి. పల్లె ప్రజలు అవస్థల మధ్య ప్రయాణాలను సాగిస్తున్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో రోడ్లపై తట్టెడు మట్టి కూడా వేయలేదని ఆరోపణలు చేసిన కూటమి నేతలు నేడు పల్లె రోడ్ల గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. పల్లెలకు సంబంధించిన రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో పలు బస్సు సర్వీసులు కూడా రద్దు అయినట్లు తెలుస్తోంది. కోడుమూరు నుంచి గూడురు వరకు (వయా చనుగొండ్ల ) రోడ్డు పూర్తి అయినా నేటికీ బస్సు సర్వీసు ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఎమ్మిగనూరు, కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు తదితర మండలాల్లోని గ్రామాలకు చెందిన రోడ్లు పూర్తి అధ్వానంగా తయారయ్యాయి.

➤ ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం – శిరివెళ్ల రోడ్డు పూర్తి స్థాయిలో ఛిద్రమైంది. గుంతల మయంగా మారిన ఈ రోడ్డుపై 15 గ్రామాలకు చెందిన ప్రజలు అవస్థల ప్రయాణం చేస్తున్నారు.



గుంతలు పడిన రుద్రవరం- శిరివెళ్ల రోడ్డు

➤ గ్రామాల్లో డ్రైనేజీలను ఏర్పాటు చేయకుండా సీసీ రోడ్లను నిర్మించడంతో అనేక ఇబ్బందులను ప్రజలు ఎదుర్కొంటున్నారు. జూపాడుబంగ్లాతో పాటు తంగడంచె ఎస్సీ, బీసీ కాలనీలు, పారుమంచాల ఎస్సీ కాలనీతో అంతర్గత రహదారులు నిర్మించినా డ్రైనేజీలను ఏర్పాటు చేయలేదు. వర్షపు నీరు రోడ్లపైనే నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



### తీరని దాహం

మంచినీరు కోసం తోపుడు బండ్లలో బిందెలను తీసుకొచ్చి మినీ ట్యాంకుల వద్ద వేచి చూస్తున్న వీరు ఆస్పరి మండలం ములుగుందం గ్రామస్తులు. గ్రామంలో 10 వేల మంది నివాసం ఉంటున్నా సక్రమంగా నీరు సరఫరా చేయడం లేదు. గ్రామంలోని దూదేకుల వీధి, ఎస్సీ కాలనీలకు నీటి సరఫరా బంద్ అయ్యింది. ప్రజలు వేరేచోటకు వెళ్లి తాగునీటి కోసం రోజంతా ఎదురుచూడాల్సి వస్తోంది. సమస్యను అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

- గుక్కెడు నీటికి అల్లాడుతున్న గ్రామీణ జనం
- గ్రామీణ రోడ్లను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- రూ.3 కోట్లు మంజూరైనా కలగా ఏటిపాయ చెక్‌డ్యాం నిర్మాణం
- వర్షాలు వస్తే కుందరవాగుపై రాకపోకలు బంద్
- పారిశుధ్య లోపంతో ఐవీఆర్‌ఎస్‌కు కాల్స్
- పంట రుణాలపై మీనమేషాలు
- అన్నదాతను వేధిస్తున్న యూరియా
- నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా పల్లె ప్రజల కష్టాలు అలాగే ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక గ్రామాలను తాగునీటి సమస్య వేధిస్తోంది. ఛిద్రమైన రోడ్లపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో హడావిడిగా అంతర్గత రోడ్లను వేసినా డ్రైనేజీలను మరచిపోయారు. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదమయంగా మారి తీవ్ర ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతకు అవసరమైన ఎరువులు కూడా అందని పరిస్థితి నెలకొనింది. వ్యవసాయానికి బ్యాంకుల ద్వారా రుణాలు కూడా అందక పోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అనేక గ్రామాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఇంటింటి చెత్త సేకరణలో పూర్తి స్థాయి నిర్లక్ష్యం ఉన్న కారణంగా గ్రామాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. తమ కష్టాలను పల్లె ప్రజలు ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తున్నారు. మరో వైపు వైద్య సేవలు కూడా అంతంత మాత్రంగానే ఉన్న కారణంగా అనేక మంది పట్టణాల్లోని ప్రైవేటు ఆసుపత్రుల వైపు చూస్తున్నారు.

**ఎరువు..కరువు**

జిల్లాలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఓపెనింగ్ బ్యాలెన్స్ 15,284 టన్నులు ఉండగా, తాజాగా 7,107 టన్నులు వచ్చింది. మొత్తంగా 22,392 టన్నులు నిల్వ ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో యూరియా కొరత ఉన్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక బస్తా యూరియా ధర రూ.262 లు ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.350కి అమ్ముతున్నట్లు సమాచారం. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు కనిపించని పరిస్థితి నెలకొనింది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను పంపిణీ చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేలను నిర్వీర్యం చేస్తోంది.

### మండలాల వారీగా సమస్యలు ఇవీ..

☛ మండల కేంద్రమైన వెల్దుర్తి ప్రజలను తాగు నీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.3.5 కోట్లు ఖర్చు చేసి కృష్ణగిరి రిజర్వాయర్ ద్వారా రోజుకు 9 లక్షల లీటర్ల నీటిని మూడు సంపుల ద్వారా వెల్దుర్తికి నీటిని సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఈ రిజర్వాయర్ గురించి పట్టించుకోకపోవడంతో చుక్క నీరు రావడం లేదు. అలాగే గత ప్రభుత్వంలో వెల్దుర్తి మండలంలోని రామళ్లకోట, గోవర్ధనగిరి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరు అయ్యాయి. సొంత భవనాలు లేకపోవడంతో వైద్య సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనాలను నిర్మిస్తే దాదాపు 39 గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందే అవకాశాలు ఉంటాయి.

☛ కోడుమూరు సబ్ డివిజన్ పరిధిలో 40 వేల ఎకరాలు ఎల్లెల్సీ ఆయకట్టు ఉన్నా, ప్రస్తుతం 400 ఎకరాలకు కూడా నీరందని పరిస్థితి నెలకొనింది.



పాణ్యం మండలం తమ్మరాజుపల్లె సమీపంలో పూర్తికాని ఏటిపాయ చెక్‌డ్యాం

అలాగే కోడుమూరు నుంచి పులకుర్తి, కల్లపరి మీదుగా సీ బెళగల్ వరకు నడుస్తున్న ఆర్‌టీసీ బస్సు రద్దు కావడంతో ప్రజలు, ద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

☛ గాజులదిన్నె డ్యాం పక్కనే ఉన్నా మండల కేంద్రమైన గోనెగండ్లను తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. తుంగభద్ర కెనాల్‌లో నీటిని ఎస్ఎస్ ట్యాంకకు లిఫ్ట్ చేసి కుళాయిల ద్వారా నీటిని అందించాల్సి ఉంది. అయితే కెనాల్‌లో నీరు తగ్గిపోవడంతో రోజుకు 30 నుంచి 45 నిమిషాలు మాత్రమే నీటిని సరఫరా చేయడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

☛ పెద్దకడుబూరు మండలంలోని బసలదొడ్డి, గవిగట్టు, పీకలబెట్ట, కంబదహాల్ గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొనింది. పులికనుమ రిజర్వాయర్ నుంచి నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు బోర్లపైనే అధారపడి ఇబ్బందులు పడుతున్నారు. నెదర్‌ల్యాండ్ స్కీం ఉన్నా కోసిగి మండలంలోని పలు గ్రామాల ప్రజలకు కూడా తాగునీరు అందని పరిస్థితి నెల కొనింది. ఈ స్కీం నుంచి 16 గ్రామాలకు నీరు అందించాల్సి ఉండగా ప్రస్తుతం నాలుగైదు గ్రా మాలకు మించి నీరు అందని పరిస్థితి నెలకొంది.

☛ మద్దికెర మండలం బరుజుల గ్రామ ప్రజలకు తాగునీరు అందడం లేదు. గ్రామంలోని బోర్లే వీరికి దిక్కవుతున్నాయి. తాగునీటిని 10 కిలోమీటర్ల దూరంలోని పత్తికొండ నుంచి తెచ్చుకుంటున్నారు. గుంతకల్ నుంచి పెరవలి మీదుగా ఆర్టీసీ బస్సులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.



### అన్నదాతకు అందని రుణాలు

వ్యవసాయ రంగాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట రుణాలకు సంబంధించి కర్నూలు జిల్లాలో రూ. 3,635 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం రూ.500 కోట్లు కూడా పంపిణీ చేయనట్లు తెలుస్తోంది. బ్యాంకర్లు మాత్రం పాత రుణాలను రెన్యూవల్ చేసి ఎక్కువ మొత్తంలో రుణాలను అందించినట్లు లెక్కలు చూపిస్తున్నారు. వాస్తవ పరిస్థితుల్లో రైతులకు ఈ ఖరీఫ్‌లో రుణాలు అందని పరిస్థితి నెలకొనింది.

**కలగా ఏటిపాయ చెక్‌డ్యాం**

పాణ్యం మండలం తమ్మరాజుపల్లె సమీపంలోని ఏటిపాయ చెక్‌డ్యాం నిర్మాణం కలగా మిగిలిపోనుందనే అభిప్రాయాన్ని అక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఈ చెక్‌డ్యాం కొట్టుకుపోగా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.3 కోట్లను మంజూరు చేసింది. టెండర్లు దాఖలు చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ఈ పనులు ఆగిపోయాయి. అయితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పనులపై దృష్టి సారించడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ చెక్‌డ్యాం నిర్మాణం పూర్తి అయితే దాదాపు 400 ఎకరాలకు సాగునీటితో పాటు సమీప గ్రామాల ప్రజలకు తాగునీరు అందే అవకాశాలు ఉంటాయంటున్నారు.

**వంతెన లేక నిలిచిన రాకపోకలు**

ప్రతి వర్షాకాలంలోనూ ఉయ్యాలవాడ మండలం ఇంజేడు గ్రామం వద్ద కుందరవాగుపై మూడు నెలల పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మాయలూరు – ఆళ్లగడ్డ రహదారి ఇంజేడు గ్రామం నుంచి వెళ్తోంది. వాగుపై వంతెన లేకపోవడంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేకపోతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.5.50 కోట్లను మంజూరు చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ ప్రక్రియ ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఈ వంతెనపై దృష్టి సారించ లేదు. దీంతో 20 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

### నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం



జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముందుగా కోఆప్షన్ సభ్యునిగా ఎన్నికైన వారిని జెడ్పీ స్థాయీ సంఘ కమిటీల్లో సభ్యునిగా నియమించేందుకు ఎన్నిక నిర్వహిస్తామన్నారు. అనంతరం వ్యవసాయం – అనుబంధ శాఖలు, వైద్యం – ఆరోగ్యం, పారిశుధ్యం, విద్యపై సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమావేశాని కంటే ముందు ఉదయం 9 గంటలకు జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో 1వ స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సీఈఓ తెలిపారు.

# చెత్త రహిత జిల్లాగా మార్చాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: అధికారులు నిబద్ధతతో పని చేసి చెత్త రహిత జిల్లా మార్చాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ 2025పై ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శిలకు ఒకరోజు జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాను పారిశుద్ధ్యపరంగా పరిశుభ్రంగా ఉండేలా చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. జిల్లాకు స్వచ్ఛ సర్వేక్షణ టీమ్స్ రావడం జరుగుతోందన్నారు. అకడమిక్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న గ్రామాలను పరిశీలించి అక్కడ నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి పరిశుభ్రంగా ఉన్న గ్రామాలకు ర్యాంకులు కేటాయిస్తారని చెప్పారు. వైద్య సహాయం, ఆర్థిక సహాయం కోసం ప్రజలు ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వెంటనే జిల్లా యంత్రాంగానికి పంపాలన్నారు. అనంతరం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో అమలు చేయాల్సిన కార్యక్రమాలు, చేపట్టాల్సిన చర్యలు తదితరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పించారు. సమావేశంలో డీపీఓ లలితా బాయి, డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి డీఎల్‌పీఓ మంజుల వాణి పాల్గొన్నారు.

# విధి 'పరీక్ష'లో విగత జీవిగా..

- బైక్ చక్రంలో బురక ఇరుక్కుని కింద పడిన మహిళ
- వెనక వస్తున్న ట్యాంకర్ ఆమెపై వెళ్లడంతో దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన షబానా

పాణ్యం: టీచర్ ఉద్యోగం సాధించాలన్నది ఆమె కల. ప్రభుత్వ కొలువు సాధించి కుటుంబానికి అండగా నిలవాలనుకుంది. కల సాకారం చేసుకునేందుకు పరీక్షకు సైతం హాజరైంది. విధి ఆ కలతో పాటు ఆమెను ఛిద్రం చేసింది. పాణ్యం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామానికి చెందిన షబానా (30) పాణ్యం సమీపంలో ఆర్‌జీఎం కళాశాలలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన డీఎస్సీ పరీక్షకు హాజరైంది. పరీక్ష రాసిన తర్వాత భర్త ఇద్రూస్‌బాషాతో కలసి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరారు. మార్గ మధ్యలో పాణ్యం వద్ద ఎస్సార్బీసీ కాల్వ దాటగానే షబానా ధరించిన బురక బైక్ వెనుక చక్రంలో ఇరుక్కుపోవడంతో ఆమె కింద పడింది. అదే సమయంలో వారి వెనుక వస్తున్న ట్యాంకర్ ఆమెపై వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ట్యాంకర్ వెళ్లడంతో షబానా శరీరం ఛిద్రమైంది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ట్యాంకర్‌ను పోలీసు స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం కాగా.. ఇద్రూస్ బాషా పాలిష్ కటింగ్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

# కూటమి పాలనలో శాంతి లేదు.. భద్రత లేదు

- రామసుబ్బారెడ్డిది ముమ్మాటికీ హత్యే
- కేసు నీరుగారిస్తే ఆందోళన చేస్తాం
- ప్రభుత్వ తీరుపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు
- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం



రామసుబ్బారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: కూటమి పాలనలో రాష్ట్రంలో ప్రజలకు శాంతి, భద్రత లేదని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి విమర్శించారు. మసీదుపురం గ్రామానికి చేరుకుని రామసుబ్బారెడ్డి మృతి సమాచారం తెలుసుకున్న ఆయన శుక్రవారం గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి, మృతుడి కుటుంబీకులను పరామర్శించారు. మృతుడి భార్య తులశమ్మ, సోదరుడు బుగ్గారెడ్డి, కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో శిల్పా మాట్లాడుతూ.. రామసుబ్బారెడ్డి పార్టీలకు అతీతుడని, సౌమ్యుడైన ఆయనను కూటమి నేతలు చంపేశారని, ఈత వచ్చి నోడు ఎలా చస్తాడు, శరీరంపై గాయాలెందుకు ఉంటాయని, ఇది ముమ్మాటికీ హత్యేనన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి హత్యకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసును తప్పుదారి పట్టించాలని చూస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో శ్రీశైలం నియోజకవర్గంలో బండిఆత్మకూరు మండలం లింగాపురంలో ఒకటి, మహానంది మండలం సీతారామపురంలో మరొకటి, ఇప్పుడు మసీదుపురంలో ఇది మూడో హత్య అన్నారు.

**మద్యం డోర్ డెలివరీ**

కూటమి నేతలు కమీషన్ల కోసం గ్రామాల్లో మద్యం సీసాలను డోర్ డెలివరీ చేస్తున్నారని శిల్పా విమర్శించారు. పాల ప్యాకెట్లు దొరకని పల్లెల్లో 24 గంటలూ మద్యం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తే కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మసీదుపురం సర్పంచ్ కాకనూరు లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మునగాల నాగమల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

**టీడీపీ బాండ్లతో త్వరలో ఇంటింటికీ..**

ఎన్నికలకు ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీల బాండ్లతో త్వరలో ఇంటింటికీ తిరగనున్నామని శిల్పా స్పష్టం చేశారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నిర్వహించిన వెన్నుపోటు, యువతపోరు కార్యక్రమాలకు విశేష స్పందన లభించిందని, ప్రజలు, యువకులు, నిరుద్యోగులు స్వచ్ఛందంగా హాజరు కావడం ప్రభుత్వంపై వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. కూటమి నేతలు ఇచ్చిన బాండ్లు తీసుకుని వెళ్లి ఎవరికి ఏ ప్రయోజనం చేకూరిందో తెలుసుకుని కూటమి ప్రభుత్వం దుర్మార్గాన్ని ఎండగడతామన్నారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ వాహనం కింద పడి ఒకరు మృతి చెందిన విషయంపై విలేకరులు ప్రస్తావించగా.. కూటమి నేతలు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పెయిడ్ ఆర్టిస్టులతో వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

# డిప్యూటీ ఎంపీడీఓలుగా 18 మందికి పదోన్నతి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని 10 మంది గ్రేడ్–2 వీడీఓలు, ఇద్దరు గ్రేడ్–2 ఈఓలు, ఆరుగురు జిల్లా పరిషత్‌లోని సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతి లభించినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదోన్నతి పొందిన వీడీఓల్లో టి.బాలాంజనేయులు, ఎ.నాగరాజు, కె.నాగరాజు, వై.ప్రభాకర్, పి.హరిలీల, ఎ.విజయలక్ష్మి, సి.జాకీర్‌హుసేన్, వి.జేమ్స్ కృపావరం, జి.మహేశ్వరి, సయ్యద్ అబ్దుల్ రహీం ఉన్నారన్నారు. అలాగే ఈఓల్లో అజయ్ భాస్కర్ మురహరి, కటికి సుబ్బారావు, జెడ్పీ సీనియర్ అసిస్టెంట్లలో సి.నాగలక్ష్మమ్మ, జి.దేవదానం, జీఎంఏ కిషోర్‌కుమార్, కె.మురళీ శ్రీనివాసులు, పి.గోపాల్, పీఏఎన్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఉన్నట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓలుగా పదోన్నతి పొందిన వారికి త్వరలో పోస్టింగ్స్ ఇస్తామన్నారు.

# 866 పింఛన్ల కోత

కర్నూలు(అగ్రికల్చర్): జూన్ నెలతో పోలిస్తే జూలైలో 866 పింఛన్లకు కోతపడింది. ఉమ్మడి జిల్లాలో 4,54,493 పింఛన్లకు రూ.196.61 కోట్లు మంజూరయ్యాయి. కర్నూలు జిల్లాలో 2,39,041 పింఛన్లకు రూ.103.85 కోట్లు, నంద్యాల జిల్లాలో 2,15,452 పింఛన్లకు రూ.92.76 కోట్లు మంజూరు చేశారు. జూలై 1వ తేదీ పంపిణీ చేస్తారు. కర్నూలు జిల్లాలో 2,312, నంద్యాల 2,319 స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

## క్లుప్తంగా

### వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలకు రేపు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీలకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కే తులసీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 9 గంటలకు జీ పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియం హాల్‌లో బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఈ ఏడాది మే 31వ తేదీ నాటికి ఒకే స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు 570 మంది, ఐదు సంవత్సరాలు పూర్తి కాని వారు 131 మంది వ్యక్తిగత అభ్యర్థన కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. స్టేషన్ సీనియారిటీ, ఒకే రోజు చేరిన వారికి పోస్టు నియామకం, ర్యాంక్‌ను పరిగణనలోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారందరూ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

### నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నంద్యాల(అర్బన్): ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నంద్యాలవ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కోర్సుల్లో చేరేందుకు పదవ తరగతి పాస్ అయిన విద్యార్థుల నుంచిదరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుఏడీఆర్ జాన్సన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 వరకు దర ఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. దరఖాస్తులను www. angrau. ac. in వెబ్ సైట్ ద్వారా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల కార్యాలయం 9989625208 సంప్రదించాలన్నారు.

### యువకుడి ఆత్మహత్య

శిరివెళ్ల: గోవిందపల్లెకు చెందిన గద్దం రవికుమార్ (22) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. నెలన్నర క్రితం రవికుమార్ కడుపు నొప్పి తాళలేక ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపంతో ఈ నెల 26వ తేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గుర్తించి వెంటనే కిందకు దించి చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### యర్రగుంట్లలో చోరీ

శిరివెళ్ల: యర్రగుంట్లలో శుక్రవారం పట్టపగలు చోరీ జరిగింది. స్థానిక గాయత్రి పాఠశాల రస్తాలో నివాసముంటున్న తిమ్మయ్య కుటుంబీకులు ఉదయం పొలానికి వెళ్లారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 60 వేల నగదు అపహరించారు. ఇంటికి చేరుకున్న తిమ్మయ్య చోరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపారు.

### 29, 30 తేదీల్లో వీఏఏల బదిలీలు

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ వ్యవసాయ సహాయకుల (వీఏఏల) బదిలీలను వ్యవసాయ శాఖ ఈ నెల 29, 30 తేదీల్లో చేపడుతోంది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా బదిలీలు చేపట్టనున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యవసాయ అధికారులు, కర్నూలు డీపీవో కార్యాలయ పరిపాలన అధికారి సభ్యులుగా ఉండే కమిటీ బదిలీలను చేపట్టనున్నారు. వీఏఏలు దాదాపు ప్రతి ఒక్కరు కూటమి పార్టీల నేతల సిఫారస్సు లేఖలతో బదిలీలకు సిద్ధమయ్యారు. ఐదేళ్లు పూర్తి అయిన వారందరూ బదిలీ కావాల్సిందే.

**పశుసంవర్ధక శాఖలో నేడు..**

పశుసంవర్ధక శాఖలో గ్రామ స్థాయిలో పనిచేస్తున్న ఏహెచ్‌ఏల బదిలీలను శనివారం చేపట్టనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 377 మంది ఏహెచ్‌ఏలు పనిచేస్తున్నారు. ఇందులో 13 మంది మాత్రమే ఐదేళ్లు పైబడిన వారు ఉన్నారు. 64 మంది రిక్వెస్ట్‌పై బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయాలను కుదించడంతో 27 మందికి స్థానాలు కేటాయించాల్సి ఉంది. మొత్తంగా 104 మంది ఏహెచ్‌ఏలు బదిలీ అయ్యే అవకాశం ఉంది. కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలోని గోకులం సమావేశ మందిరంలో బదిలీలను ఉమ్మడి జిల్లా యూనిట్‌గా చేపట్టనున్నారు.

# ప్రైవేటు దిగిరాక.. అడ్మిషన్లు అందక!



కర్నూలు నగరంలోని బంగారు పేటకి చెందిన సి.శిరీషా, రామాంజనేయులు దంపతులకు ఇద్దరు సంతానం. చిన్న కూతురు సి.యామినికి ఉచిత విద్య కింద దరఖాస్తు చేయగా కొత్తపేటలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సీటు వచ్చింది. అయితే అడ్మిషన్ కోసం వెళితే ప్రభుత్వం మాకు డబ్బులు ఇస్తుందనే నమ్మకం లేదని, ఫీజులు ప్రభుత్వం ఇవ్వకపోతే మేమే చెల్లిస్తామని రాతపూర్వకంగా ఆ స్కూల్ యాజమాన్యం రాయించుకుంది. అయినప్పటికీ సీటు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు.



ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన మద్దయ్యకు ఇద్దరు మనవళ్లు. ఒకరు నన్నూరులోనే చదువుతున్నారు. మరో మనవుడు కురువ అనిల్ కుమార్ 1వ తరగతికి ఉచిత విద్య కోసం దరఖాస్తు చేశారు. వీరికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్(కేజేఎఫ్ సిటీ, చిన్నటేకూరు)లో సీటు కేటాయించారు. ఈ స్కూల్ గతంలో నన్నూరు పరిధిలో ఉంది. ప్రస్తుతం కల్లూరు మండలం చిన్నటేకూరుకు మార్చారు. యాజమాన్యం ఈ స్కూల్ చిరునామాను మార్చకపోవడంతో ఆన్‌లైన్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఎంపిక చేసుకున్నారు. అడ్మిషన్ కోసం స్కూల్‌కు వెళితే మీరు అర్హులు కాదని వెనక్కి పంపించారు. కల్లూరు ఎంఈఓ ఆ స్కూల్‌కి నోటీసులు ఇచ్చి చేర్చుకోవాలని సూచించారు. అయినప్పటికీ యాజమాన్యం పెడచెవిన పెడుతుండటంతో తల్లిదండ్రులు వారం రోజులుగా డీఈఓ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



కల్లూరు మండలం కస్తూరి నగర్‌లో నివాసం ఉంటున్న బండారి శివాజీకి ఒక కూతురు సంతానం. చిరుద్యోగం చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఒకటో తరగతిలో ప్రవేశానికి విద్యాహక్కు చట్టం కింద ఉచితంగా దరఖాస్తు చేయగా అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర స్కూల్‌లో సీటు వచ్చింది. అయితే మీరు నివాసం ఉంటున్న కాలనీ నుంచి మా స్కూల్‌కి రావాలంటే హైవేరోడ్డు ఉందని, రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని అడ్మిషన్‌కు నిరాకరించారు. మొదటి, రెండో విడతలోనూ సీటు కేటాయించిన యాజమాన్యం అడ్మిషన్ ఇవ్వడం లేదని ఆయన వాపోతున్నాడు.

...జిల్లాలో వందలాది మంది తల్లిదండ్రులు పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ఉచిత విద్యకు ఎంపికైనా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు అడ్మిషన్ ఇవ్వకుండా చుక్కలు చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

**పేద విద్యార్థులకు అందని ఉచిత విద్య**

- అడ్మిషన్లకు నిరాకరిస్తున్న ప్రయివేట్ పాఠశాలలు
- బకాయిలు చెల్లించాలని మొండిపట్టు
- విద్యాశాఖ నోటీసులకూ స్పందించని యాజమాన్యాలు
- అడ్మిషన్లకు నేటితో ముగియనున్న గడువు
- డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన తల్లిదండ్రులు



ఉచిత విద్యపై డీఈఓను చుట్టుముట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు

| | |
|---|---|
| జిల్లాలోని ప్రయివేట్ స్కూళ్లు .. | 769 |
| ఉచిత విద్యను అందించేందుకు మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న పాఠశాలలు | 384 |
| ఉచిత విద్య కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంఖ్య | 2,289 |
| 122 పాఠశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులు | 1,110 |
| 262 పాఠశాలల్లో అడ్మిషన్‌కు నిరాకరించిన విద్యార్థుల సంఖ్య | 1,179 |
| 173 స్కూళ్లలో రెండో విడత సీట్లు దక్కించుకున్న విద్యార్థులు | 1,056 |

కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వంలో ఉచిత విద్య అందని ద్రాక్షగా మారింది. దరఖాస్తు ప్రక్రియ పూర్తయి పాఠశాలల కేటాయింపు చేపట్టినా ఇప్పటికీ అడ్మిషన్ల ప్రక్రియ కొలిక్కిరాని పరిస్థితి. పాఠశాలలు ప్రారంభమై ఇరవై రోజులు దాటుతున్నా ఇప్పటికీ తమ పిల్లలకు ప్రయివేట్ పాఠశాలలు అడ్మిషన్ ఇవ్వకపోవడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. జిల్లా కలెక్టర్ ఆదేశిస్తున్నా, డీఈఓ చర్చలు సాగిస్తున్నా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు మెట్టు దిగిరాని పరిస్థితి. అదేమంటే.. ఈ ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందో, లేదోనని తమకు అనుమానంగా ఉందని చెబుతుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో శుక్రవారం వందలాది మంది తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కలిసి డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు.

**ఉచిత విద్యపై కొరవడిన చిత్తశుద్ధి**

కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లలో పేదింటి పిల్లలు చదువుకునే అవకాశాన్ని 2022–23 నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారు. మూడేళ్లు ఎక్కడ కూడా ఉచిత విద్యకు ఎంపికైన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చదువులు సాఫీగా సాగిపోయాయి. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించారు. ఆ సందర్భంగా ప్రభుత్వం సరైన వాదనలు వినిపించకపోవడంతో కోర్టు జీఓ 24 రద్దు చేసింది. అయితే 2024–25 విద్యా సంవత్సరం విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జీఓను కొనసాగిస్తూ తీర్పునిచ్చింది. 2025–26 విద్యా సంవత్సరంలో 12(1)సీ ప్రకారం సరైన విధివిధానాలు లేకుండా సీట్ల భర్తీ ప్రక్రియ చేపట్టారు. ఫస్ట్, సెకెండ్ జాబితాలు విడుదల చేసి, ఎంపికైన వారి వివరాలను ఆయా స్కూళ్లకు పంపించారు. అయితే మెజార్టీ స్కూళ్ల యాజమాన్యాలు అడ్మిషన్ చేసుకోకుండా తల్లిదండ్రులను తిప్పిపంపుతున్నారు.

**నోటీసులను లెక్కచేయని యాజమాన్యాలు**

ఆయా ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత విద్య కింద సీటు పొందినప్పటికీ అడ్మిషన్ ఇవ్వని పరిస్థితిపై జిల్లా విద్యా శాఖ నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ స్పందించకపోవడంతో మరోసారి నోటీసులు జారీ చేస్తూ పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇటీవల ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు డీఈఓతో సమావేశమై బకాయిలు చెల్లించకపోతే అడ్మిషన్లు ఇవ్వలేమని తేల్చిచెప్పారు. ఆయన సర్దిచెప్పినప్పటికీ అడ్మిషన్లు ఇవ్వని పరిస్థితి. ఇదే సమయంలో రెండో విడత సీట్ల కేటాయింపు జరిగిపోయింది. ఈ విద్యార్థులు కూడా ఆయా పాఠశాలలకు వెళ్లగా అడ్మిషన్‌కు నిరాకరించడంతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

**డీఈఓ కార్యాలయం ముట్టడి**

ప్రయివేట్ పాఠశాలల తీరుతో విసిగిపోయిన తల్లిదండ్రులు విద్యార్థి సంఘాలతో కలిసి శుక్రవారం డీఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆ సమయంలో డీఈఓ లేకపోవడంతో అక్కడే మెట్లపై కూర్చొని నిరసన తెలిపారు. డీఈఓ వచ్చాక ఆయనను చుట్టుముట్టి అడ్మిషన్ ఇవ్వని ప్రయివేట్ పాఠశాలలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. పిల్లలకు అన్యాయం చేయకండని చేతులెత్తి మొక్కారు. ఈ నేపథ్యంలో డీఈఓ స్పందిస్తూ శనివారం సాయంత్రంలోపు సీట్లు పొందిన విద్యార్థులందరినీ పాఠశాలల్లో చేర్పించుకునేలా చూస్తామన్నారు. లేనిపక్షంలో ఏ కారణంచేత తిరస్కరించారో స్పష్టంగా నివేదిక ఇవ్వాలని ఎంఈఓను ఆదేశించారు.

## జూలై 10న ఎల్లెల్సీకి నీటి విడుదల



ఐసీసీ సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



ఇంగళదహాళ్ సెక్షన్ వద్ద ఎల్లెల్సీఆధునికీకరణ పనులు

- బెంగళూరులో జరిగిన ఐసీసీలో నిర్ణయం

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయం నుంచి జూలై 10న ఎల్లెల్సీకి కర్ణాటక కోటా నీటి విడుదలకు కర్ణాటక నీటి సలహా మండలి(ఐసీసీ) నిర్ణయం తీసుకుంది. శుక్రవారం బెంగళూరులోని విధానసౌధలో జరిగిన 124వ నీటి సలహా మండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం టీబీ డ్యాంలో 1,620 అడుగుల వద్ద 60 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే ఈ ఏడాది ముందుగానే డ్యాంకు వరదలు రావడం, ఇంకా ఆగస్టు 15 వరకు వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో కాలువలకు నీటి విడుదలపై సమావేశం నిర్వహించారు. ప్రస్తుత నిల్వ ఆధారంగా నీటి విడుదలపై నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రకారంగా ఖరీఫ్‌కు జూలై 10 నుంచి నవంబర్ 30 వరకు కర్ణాటక దిగువ కాలువకు 650 క్యూసెక్కుల ప్రకారం నీరు విడుదల చేయనున్నారు. ఇక ఆంధ్ర అధికారులు తమ కోటా నీటిలో ఇండెంట్ ఇస్తే అదే రోజు ఇరు రాష్ట్రాల కోటా నీటిని (దాదాపు 1,400 క్యూసెక్కులు) వదలనున్నారు. ఇదిలాఉంటే ఎల్లెల్సీ 155 కి.మీ, 205కి.మీ నుంచి 250 కి.మీ వరకు కాలువలో గత నెలన్నర రోజులుగా ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తి మందకొడిగా సాగుతుండటంతో నీటి విడుదల నాటికి పూర్తవుతాయో లేదోననే ఆందోళన వ్యక్తమవుతోంది. అదేవిధంగా టీబీ డ్యాం 33 కొత్త క్రస్టు గేట్లను అమర్చే పనులు డ్యాంకు వచ్చే వరదను బట్టి డిసెంబర్ నెలలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా టీబీ డ్యాం నుంచి వివిధ కాలువలతో పాటు దిగువ కాలువ(ఎల్లెల్సీ) కింద కేవలం ఖరీఫ్‌కు మాత్రమే సాగుకు నీరిచ్చేందుకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## పీఈటీపై విద్యార్థి దాడి

ఓర్వకల్లు: ధూమపానం చేయొద్దని మందలించిన వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ)పై ఒక విద్యార్థి కర్రతో దాడి చేశాడు. గాయపడిన పీఈటీ.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాఠశాలలో రిటైర్డ్ అయిన హెచ్‌ఎంకు ఈ నెల 26న సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అందరూ భోజనం చేస్తున్న సమయంలో గ్రామానికి చెందిన ఓ పదో తరగతి విద్యార్థి బయటకు వెళ్లి ధూమపానం చేస్తున్నట్లు తెలుసుకుని పీఈటీ మందలించాడు. ఈ విషయంలో విద్యార్థికి, పీఈటీకి మధ్య వాగ్వాదం జరగడంతో ఉపాధ్యాయులు సర్ది చెప్పిపంపారు. ఈ విషయం మనస్సులో పెట్టుకొన్న విద్యార్థి వ్యాయామ ఉపాధ్యాయుని బైక్ చక్రాలకు గాలి తీశాడు. విషయం తెలిసి పీఈటీ మందలించడంతో కర్రతో విద్యార్థి దాడిచేయగా చేయికి బలమైన గాయమైంది. పీఈటీ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆ విద్యార్థిని మందలించి, మరోసారి ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నేడు సచివాలయ మహిళా పోలీసుల బదిలీలు

కర్నూలు: గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీసులకు శనివారం బదిలీల ప్రక్రియ చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి కొండారెడ్డిబురుజు వద్ద నున్న జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీల కోసం స్పౌజ్, హెల్త్, దివ్యాంగులు తమ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని పేర్కొన్నారు.

## శ్రావణంలో శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ఆరాధనోత్సవ ఆహ్వాన కార్డుతో శ్రీమఠం మేనేజర్లు

మంత్రాలయం: సద్గురు శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు శ్రావణ మాసంలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం 354వ సప్తరాత్రోత్సవాలకు సంబంధించి ఆహ్వాన కార్డుకు ప్రత్యేక పూజలు చేపట్టారు. మఠం మేనేజర్ శ్రీనివాసరావు, ధార్మిక మేనేజర్ శ్రీపతి ఆచార్ నేతృత్వంలో రాఘవేంద్రులు, వాదీంద్రతీర్థుల మూల బృందావనాలతో ఉంచి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ప్రముఖులకు ఈ ఆహ్వాన కార్డుల ద్వారా ఆహ్వానం పలుకనున్నారు.

## కారు అద్దాలు పగులగొట్టి ..

- రూ. 7 లక్షలు అపహరణ



కారు అద్దాలు పగులగొట్టిన దృశ్యం

ఆళ్లగడ్డ: సినీ ఫక్కీలో కారు అద్దాలు పగలగొట్టి పట్టపగలే రూ. 7 లక్షలు చోరీ చేసిన ఘటన ఆళ్లగడ్డలో శుక్రవారం జరిగింది. అహోబిలం గ్రామానికి చెందిన నరేష్ పట్టణంలోని ఓ బ్యాంకులో రూ. 7 లక్షలు డ్రా చేసుకుని నగదు బ్యాగ్‌ను కారులో పెట్టుకున్నాడు. అక్కడి నుంచి విశ్వశాంతి స్కూల్‌లో చదువుతున్న పిల్లల దగ్గరకు వెళ్లాడు. స్కూల్ ఎదుట కారు ఆపి తరగతి గదిలోని పిల్లల దగ్గరకు వెళ్లాడు. అంతలోనే కారు వెంట బైక్‌పై ఫాలో అవుతూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు అందరూ చూస్తుండగానే కారు అద్దాలు పగులగొట్టి రూ. 7 లక్షలు ఉన్న బ్యాగును దొంగిలించి పారిపోయారు. గమనించిన వ్యక్తులు కేకలు వేస్తూ వెంటపడగా నిమిషాల్లోనే కనిపించకుండా పారిపోయారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 30న వక్ఫ్ బచావో బహిరంగ సభ

- పోస్టర్లను ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్వీమోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు 'వక్ఫ్ బచావో– దస్తూర్ బచావో' పేరుతో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపు నిచ్చారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం సాయంత్రం ఎస్వీ కాంప్లెక్స్‌లో ముస్లిం నేతలతో కలిసి ఎస్వీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధి కోసం వక్ఫ్ బోర్డు పనిచేస్తోందన్నారు. ఈ బోర్డు కింద లక్షలాది ఎకరాల భూములు ఉన్నాయన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. తాహాఫజ్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు హమీద్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నగర అధ్యక్షులు పత్తా బాషా, అవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు షరీఫ్, అమానుల్లా మౌలానా సాహెబ్, సౌఖత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు పంచాయతీ కార్యదర్శుల బదిలీలకు కౌన్సెలింగ్



జీ. భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శి ( గ్రేడ్ – 5 ), డిజిటల్ అసిస్టెంట్ ( గ్రేడ్ – 6 ) బదిలీలకు ఈ నెల 28, 29వ తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జీ భాస్కర్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ –5 ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే 29వ తేదీన ఉదయం 10 గంటలకు డిజిటల్ అసిస్టెంట్లకు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే వారు తమ కేటగిరీలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలను తీసుకురావాలన్నారు.

## మద్యం మత్తులో భార్యను చంపిన భర్త





మృతురాలు లక్ష్మీదేవి (ఫైల్),భర్త హనుమంతు

మంత్రాలయం: కట్టుకున్న భార్యనే ఒక భర్త మద్యం మత్తులో కడతేర్చాడు. నూరేళ్ల బంధాన్ని మద్యంలోనే తెంచుకున్నాడు. మంత్రాలయం మండలం సూగూరు గ్రామంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోయ హనుమంతును 28 ఏళ్ల క్రితం ఎమ్మిగనూరు మండలం గుడేకల్ గ్రామానికి చెందిన బి.లక్ష్మీదేవి(45) వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొన్ని రోజులుగా హనుమంతు మద్యం తాగుతూ తిరిగేవాడని గ్రామస్తులు చెబుతున్నారు. అనుమానంతో భార్యను వేధిస్తూ వచ్చాడు. పెద్దలు ఎంతగా నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. శుక్రవారం వేకువ జామున 3.30 గంటల సమయంలో గాఢ నిద్రలో ఉన్న భార్యపై ఇంట్లోని గుంటక మేడిగుంజతో విచక్షణ రహితంగా దాడికి చేశాడు. తల్లి అరుపులు విన్న కుమారుడు, కుమార్తె అడ్డుకోబోయారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం బొలెరో వాహనంలో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే ఆమె ప్రాణాలు విడిచినట్లు నిర్ధారించారు. కళ్లెదుటే తల్లి మృతి చెందడంతో కుమారుడు, కుమార్తె బోరున విలపించారు. భార్యను హతమార్చిన హనుమంతు ఊర్లోనే రోకలిబండ పట్టుకుని తిరుగుతూ ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ శివాంజల్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



### వీహెచ్‌ఏల బదిలీల కోసం ప్రత్యేక బృందం

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖలో పనిచేస్తున్న గ్రామ ఉద్యాన సహాయకుల బదిలీల ప్రక్రియను ఈ నెల 28న చేపట్టనున్నారు. వీహెచ్‌ఏల బదిలీల కోసం కర్నూలు ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ఉద్యాన అధికారులతో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. ఉమ్మడి జిల్లా యూనిట్‌గా వీహెచ్‌ఏల బదిలీలు చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 215 మంది వీహెచ్‌ఏలు పనిచేస్తున్నారు. ఇందులో 90 శాతం మంది బదిలీ అయ్యే అవకాశం ఉంది. ప్రతి వీహెచ్‌ఏ అనుకూలమైన స్థానం కోసం టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో, ఇన్‌చార్జీలతో లెటర్లు తీసుకున్నారు. శనివారం ఉద్యాన భవన్‌లో బదిలీల ప్రక్రియను నిర్వహించడానికి రంగం సిద్ధమైంది.

## సీమ రైతులపై చంద్రబాబుది కపట ప్రేమ

- 'పోతిరెడ్డిపాడు' నుంచి నీటి విడుదల చేయండి



పోతిరెడ్డిపాడు అప్రోచ్‌కాల్వలో నిండుగా ఉన్న కృష్ణాజలాలు (శ్రీశైలం బ్యాక్‌వాటర్)



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులు

జూపాడుబంగ్లా: రాయలసీమ రైతులపై సీఎం చంద్రబాబు నాయుడు కపట ప్రేమ ఒలకబోస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులు విమర్శించారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలకు ఆస్కారం ఉన్నా పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలంటూ వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగల భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, సర్పంచ్ నాగార్జునరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డితో పాటు పలువురు రైతులు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి తదితరులు శుక్రవారం పోతిరెడ్డిపాడును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీబాగ్ ఒడంబడిక, బచావత్ తీర్మాన ప్రకారంగా శ్రీశైలం జలాశయంతో 854 అడుగుల నీటిమట్టం చేరితే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా సాగు, తాగునీటిని విడుదలకు అనుమతి ఉన్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. హెడ్‌రెగ్యులేటర్‌కు అనుసంధానంగా ఉన్న తెలుగుగంగ, జీఎన్ఎస్ఎస్, కేసీ ఎస్కేప్ కాల్వల కింద 6.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ముందస్తు వర్షాలకు ఖరీఫ్ సీజన్ కింద మొక్కజొన్న, పత్తి, మినుము, కంది, తదితర పంటలను సుమారు లక్ష ఎకరాల మేర రైతులు పంటలను చేసుకున్నారన్నారు. ప్రస్తుతం వర్షాలు లేక పంటలు ఎండుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. డ్యాంలో 854 అడుగుల నీటిమట్టం దాటి వారం రోజులైనా నీటిని విడుదల చేయకపోవటంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి రాయలసీమ రైతాంగానికి సాగు, తాగునీటినివ్వకుండా సీఎం చంద్రబాబునాయుడు రైతులను మభ్యపెట్టడం తగదన్నారు. ముందుగా రాయలసీమ ఎత్తిపోతల పథకం పూర్తిచేయకుండా పోలవరం నుంచి బానకచర్ల వరకు గోదావరి జలాలను తరలిస్తామని పేర్కొనటం సబబు కాదన్నారు. 70 శాతం పూర్తైన ప్రాజెక్టును గాలికొదిలేసి.. రూ.81వేల కోట్ల నిధులతో గోదావరి జలాలను బనకచర్లకు తరలిస్తామనటం విడ్డూరంగా ఉందన్నారు. ఆందోళనలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, తరుణ్‌కుమార్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నాగశేనారెడ్డి, చిన్నమల్లయ్య, చిన్న ఎర్రన్న, భాస్కర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.